జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 159 బుధవారం 5 నవంబర్- 2025 పేజీలు : 4 వెల 2 /-

Published from : Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.





## మహిళల జట్టును సత్కరించనున్న మోడీ

న్యూఢిల్లీ (సందేశం టైమ్స్) : ఆదివారం (నవంబర్ 22)వ తేదీన జరిగిన ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు.. దక్షిణాఫ్రికా జట్టును ఓడించి క్రీడాభిమానుల్ని ఉత్సాహంలో నింపింది. 1973 తర్వాత ఇంతటి విజయాన్ని సాధించిన మహిళల జట్టును బుధవారం ప్రధాని మోడీ కలవనున్నారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలో మోడీ గెలిచిన మహిళా జట్టును కలిసి వారిని సత్కరించనున్నట్లు సోమవారం ప్రధాని కార్యాలయం వెల్లడించింది. సోమవారం రాత్రి ప్రధాని కార్యాలయం నుంచి అందిన ఆహ్వానం మేరకు మహిళా జట్టు మంగళవారం విమానంలో ఢిల్లీకి బయలుదేరారు.

## ఏపీ పల్లెల్లో రోడ్ల నిర్మాణానికి కేంద్రం భారీ నిధులు...

### పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారులకు కేంద్రం భారీ చేయూత**

**ప్రత్యేక సాయం కింద రూ.2000 కోట్లు మంజూరు**

**పనుల నాణ్యతపై రాజీపడొద్దని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం**



(సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ రహదారుల రూపురేఖలను మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో అడుగు వేసింది. రాష్ట్రంలోని పల్లెల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్ల పునర్నిర్మాణం కోసం 'స్పెషల్ అసిస్టెన్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్' (సాస్కి) పథకం కింద రూ. 2,000 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో రహదారుల వ్యవస్థను మెరుగుపరచనున్నట్టు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పనులు చేపట్టే కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి పలు దశల్లో నాణ్యతను తనిఖీ చేయడం తప్పనిసరి అని తెలిపారు. ప్రమాణాలకు విరుద్ధంగా పనులు చేపట్టినా, ఏవైనా అవకతవకలు జరిగినట్టు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే, పుట్టపర్తిలో జరగనున్న శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని అక్కడి పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ. 35 కోట్లు కేటాయించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంతో ప్రతి గ్రామానికీ పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే రహదారులను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## 70వ ప్రజా దర్బార్... 4 వేల మందిని కలిసిన మంత్రి నారా లోకేశ్

**మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహణ నాలుగు గంటల్లో సుమారు 4 వేల మందిని కలిసిన మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చి సమస్యలు తెలిపిన ప్రజలు వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందంటూ పలువురి ఆవేదన ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి పలు విజ్ఞప్తులు అందరికీ అండగా ఉంటానని హామీ**



(సందేశం టైమ్స్) : రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 70వ రోజుకు చేరుకుంది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం మరోసారి జనసంద్రంగా మారింది. మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు 4 వేల మందికి పైగా ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్య తీవ్రతను బట్టి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే బాధ్యత తమదని, అందరికీ అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిలో అధికశాతం మంది గత వైసీపీ ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న కష్టాలను, అన్యాయాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందంటూ ఫిర్యాదులు గత ప్రభుత్వంలో తమపై అక్రమ కేసులు బనాయించారని, ఆస్తులు లాక్కున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

## రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యహరిస్తోంది: వైఎస్ జగన్



(సందేశం టైమ్స్) :కృష్ణాజిల్లా పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ రైతులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. మోంథా తుపాను 25జిల్లాల్లో ప్రతీకూల ప్రభావం చూపింది. 15లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 18 నెలల కూటమి పాలనలో 16 విపత్తులు వచ్చాయి. కూటమి పాలనలో రైతులకు ఇన్సూరెన్స్ లేదు. ఇన్‌పుట్ సబ్సిడీ రూపాయి కూడా ఇవ్వలేదు' అని జగన్ విమర్శించారు.

## భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ..

### కేంద్రమంత్రి రామ్మోహన్ కీలక వ్యాఖ్యలు



విజయనగరం, నవంబరు4(సందేశం టైమ్స్) : ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం విమానాశ్రయం నిలుస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం 91.7 శాతం పూర్తి అయిందని పేర్కొన్నారు. ఇవాళ (మంగళవారం) భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ పనులని రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నాగమాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఉత్తరాంధ్రా సంస్కృతికి ప్రతిబింబంగా భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పు కొచ్చారు. వచ్చే నెలలో భోగాపురం విమానాశ్రయం నుంచి ట్రైయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీకాకుళం, భోగాపురంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో వచ్చే నెలలో జరుగనున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో భోగాపురం విమానాశ్రయ పరిసరాల్లో పలు పరిశ్రమల స్థాపనకు తగిన నివేదిక అందజేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## జగన్ హయాంలో రైతుల సమస్యలు అవినాశ్‌రెడ్డికి కనిపించలేదా.. అచ్చెన్నాయుడు ఫైర్



అమరావతి, నవంబరు4 (సందేశం టైమ్స్) : కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేరు మీద వైసీపీ నేతలు చేస్తున్న నాటకాలు ఆపాలని హితవు పలికారు. కడప జిల్లాలో ఏమి జరుగుతోందో చూడని అవినాశ్‌కి.. ఇప్పుడు రైతులపై అంత ఆకస్మికంగా ప్రేమ ఎందుకు..? వచ్చిందని ప్రశ్నించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉల్లి రైతులు నష్టపోకూడదని సీఎం చంద్రబాబు ఆలోచించి హెక్టార్‌కి రూ. 50,000 చొప్పున అందజేయాలని నిర్ణయించారని తెలిపారు. తమ ప్రభుత్వంలోఉల్లి రైతులకు రూ. 104.57 కోట్ల లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు మంత్రి అచ్చెన్నాయుడు. ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టినప్పుడు క్వింటాకు రూ. 1200 వెచ్చించి మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్ నందు సుమారు రూ. 17. 22 కోట్ల విలువ గల ఉల్లి పంటను కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. ఉల్లి పంట పాడవ్వకుండా రైతులకు తమ ప్రభుత్వం మేలు చేసిందని వివరించారు. 2020లో వైసీపీ హయాంలో ఉల్లి ధర పడిపోతే మద్దతు ధర రూ. 770లు ప్రకటించడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 129 మంది రైతుల నుంచి 970 మెట్రిక్ టన్నుల ఉల్లిని మాత్రమే సేకరించి, రైతులకు కేవలం రూ. 75 లక్షలు మాత్రమే చెల్లించిన విషయం అవినాష్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు మంత్రి అచ్చెన్నాయుడు.

## ఏపీలో ఎర్రచందనం సాగుదారులకు బయోడైవర్సిటీ బోర్డు చేయూత... రూ.3 కోట్ల నిధుల విడుదల

(సందేశం టైమ్స్) : ఎర్రచందనం సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతులకు జాతీయ జీవవైవిధ్య అథారిటీ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని 198 మంది రైతులు, సాగుదారులతో పాటు ఒక విద్యా సంస్థకు కలిపి మొత్తం రూ. 3 కోట్లను మంగళవారం విడుదల చేసింది. జీవ వనరుల సుస్థిర వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిధులను పంపిణీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. 'యాక్సెస్ అండ్ బెనిఫిట్-షేరింగ్' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. లబ్ధిదారుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల్లోని 48 గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.

# ఎల్ఐసీ పెట్టుబడులకు ఢోకా లేదు!


కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గౌతమ్ అదానీ కంపెనీలో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టింది అంటూ అమెరికన్ పత్రిక వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన కథనం ఆధారంగా మన దేశ మీడియా ఎల్ఐసీ గురించి పలు అపోహలతో కూడిన ప్రచారాన్ని సాగిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో అయితే, అతిత్వరలో ఎల్ఐసీ మునిగిపోతుందని ప్రచారం జరిగింది. వాషింగ్టన్ పోస్టు కథనం వెలువడిన మరుక్షణమే ఆదానీ సంస్థలో జరిగిన పెట్టుబడుల గురించి ఎల్ఐసీ పత్రికా ప్రకటన జారీ చేసింది కానీ ఈ ప్రకటనలోని అంశాలన్నీ సంపూర్ణంగా మీడియా ప్రచారంలోకి తేలేదు. ఎల్ఐసీ చట్టం: 1938 సెక్షన్ 27ఎ ప్రకారం మొత్తం నిధులలో 85శాతం ప్రభుత్వ ఆమోదం ఉన్న (గవర్నమెంట్ అప్రూవ్డ్) సెక్యూరిటీలలోను బాండ్లలోను పెట్టే నిబంధన ఉన్నది. మిగతా 15శాతం నిధులను మార్కెట్ అనుకూలతలను బట్టి ఇతర మార్గాల్లో పెట్టుబడులుగా పెట్టే వెసులుబాటు ఉన్నది. ఎల్ఐసీ ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ ప్రైవేట్ కంపెనీలో పెట్టుబడులు పెట్టకూడదన్న నిబంధన ఏమీ లేదు. అయితే ఎల్ఐసీ పెట్టుబడులను నిర్దేశించడానికి సంస్థాగతంగా ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అజమాయిషీ ఉంటుంది. అన్ని నిర్ణయాలూ బోర్డ్ ఆమోదంతోనే జరుగుతాయి. నిర్ణయాలు పక్షపాతంతో జరిగినట్టు ఎప్పుడూ వెల్లడి కాలేదు. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది- స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన తర్వాత ఇప్పటివరకూ ఎల్ఐసీ నామమాత్రమైన నష్టాన్ని కూడా చవిచూడలేదు. దీనికి ప్రధాన కారణం ఎల్ఐసీ ఒక దీర్ఘకాలిక పెట్టుబడిదారు అయివుండటం. అంటే మార్కెట్లో ఎన్ని ఒడుదుడుకులు ఏర్పడినా సుదీర్ఘ కాలంలో పెరుగుదల తథ్యం.

ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడం ద్వారా ఏ కంపెనీకీ నిధులు బదిలీ చేయడం జరగదు. సాధారణంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు ప్రభుత్వ పెద్దల నుండి సూచనప్రాయ సందేశాలు ప్రజలకు వచ్చినట్టుగానే కంపెనీలకు కూడా వస్తాయి. అలాంటి సందర్భంలో మార్కెట్లను స్థిరపరచడానికి, కొన్ని కంపెనీల షేర్లు తక్కువ రేటుకు అందుబాటులో ఉన్న సందర్భంలో ఎల్ఐసీ వంటి సంస్థలు ముందుకొచ్చి ఆ షేర్లను కొనుగోలు చేస్తాయి. తర్వాత కాలంలో రెట్లు పెరగడం ద్వారా సంస్థ లాభపడి పాలసీదార్లకు పెద్ద మొత్తంలో బోనస్‌లు చెల్లించగలుగుతుంది. ఉదాహరణకు ఐడీబీఐ బ్యాంకులో పెట్టుబడులు పెట్టమని ప్రభుత్వం ఆదేశిస్తే, ఎల్ఐసీ ఆ పని పూర్తి చేసింది. ఆ తర్వాత కొంతకాలం ఐడీబీఐ షేర్ రేటు స్టాక్ మార్కెట్లో పడిపోయినా, ఇప్పుడు ఎల్ఐసీ కొనుగోలు చేసిన రేటుకు ఒకటిన్నర రెట్లు పెరిగింది. ఇలా గతంలో కూడా గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, యూటీఐ, సత్యం కంప్యూటర్స్ వంటి వాటి రేట్లు మార్కెట్లో తక్కువ ధర పలుకుతున్నప్పుడు ఎల్ఐసీనే కాక అనేక ఇతర సంస్థలు కూడా కొనుగోలు చేసి తాము లాభం పొందడమే కాక మార్కెట్‌లోనూ స్థిరత్వాన్ని నెలకొల్పారు. స్టాక్ మార్కెట్లను స్థిరంగా ఉంచడానికి ఎల్ఐసీ ఒక ప్రభుత్వరంగ సంస్థగాను, చిన్న మొత్తాలను పొదుపులుగా సేకరించి పెట్టుబడులుగా మార్చే సంస్థగాను ఇలాంటి పని బాధ్యతాయుతంగా నెరవేరుస్తూ ఉన్నది. అంతేగాక, కొత్తగా మార్కెట్‌లో నమోదవుతున్న కంపెనీలను ప్రోత్సహించడానికి కూడా ఎల్ఐసీ లాంటి సంస్థలు పరిమితులకు లోబడి ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌లో పెట్టుబడులు పెడుతూ ఉంటాయి. ఈ ధోరణిని అనుసరించి- ప్రస్తుతం అదాని సంస్థలో ఎల్ఐసీ పెట్టినవి పెట్టుబడులే గాని నిధుల బదలాయింపు కాదు. ఎల్ఐసీ ఒక పటిష్టమైన ప్రభుత్వ రంగ సంస్థ. కేవలం 3.5శాతం మాత్రమే వాటాలను స్టాక్ మార్కెట్లో విక్రయించింది. రానున్న రోజుల్లో మరో 10శాతం వరకు వాటాలను మార్కెట్‌లో ఉంచాలని, ఆ తదుపరి కాలంలో మొత్తంగా 25శాతం వాటాలను మార్కెట్లో ఉంచాలని సెబీ నిబంధనలు ఉన్నవి. ఇలా వాటాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగితే ప్రైవేట్ పెట్టుబడి పెరిగిపోతే, ఆ తరువాతి నిర్ణయాల్లో అధికారులపై ప్రభావం కచ్చితంగా ఉంటుంది. అలాంటప్పుడు ఎల్ఐసీ పెట్టుబడులకు ఇప్పుడున్న నిబంధనలు వర్తింపజేయడానికి కష్టం అవుతుంది. అందుచేతనే కాబోలు ఇన్సూరెన్స్ చట్ట సవరణలను సమూలంగా మార్పు చేయాలని, తద్వారా ఇప్పుడు ఏదైతే సెక్షన్ 27ఏ పెట్టుబడులను నిర్దేశిస్తున్నదో, దానిని పూర్తిగా మార్చివేసి ఇష్టానుసారంగా ఇన్వెస్ట్‌మెంట్ చేసుకునే వెసులుబాటును కల్పించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రయత్నాలు సఫలీకృతమైతే అప్పుడు ప్రభుత్వం లేదా ప్రైవేట్ ప్రాబల్యంతో జరిగే నిర్ణయాలు ఎల్ఐసీ పెట్టుబడులను కచ్చితంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతానికి ఎల్ఐసీ పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగానే ఉన్నది కాబట్టి తన నిధుల ఇన్వెస్ట్‌మెంట్‌ను నిబంధనలకు లోబడే కంపెనీలలో పెట్టుబడులుగా పెడుతున్నది. డోనాల్డ్ ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడైన తర్వాత యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్స్ (యుఎస్‌టీఆర్) ద్వారా భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌ను నిర్దేశిస్తున్న ఐఆర్‌డీఏఐకి సూచనలు చేసే సాహసం చేస్తున్నది. ఇలా విదేశీ ఆర్థిక పెట్టుబడి ప్రాబల్యం పెరిగిన దరిమిలా, స్వదేశంలో జరుగుతున్న పెట్టుబడులపై ఆరా తీస్తూ వాషింగ్టన్ పోస్టు సదరు కథనాన్ని ఆశ్రిత పెట్టుబడి బదలాయింపుగా ప్రచురించినట్లు మనకు అర్థమవుతోంది. అందుచేత మీడియా సంస్థలు గానీ ప్రభుత్వ రంగ ఉన్నతిని కోరే మేధావులు గానీ దేశ అత్యున్నత సంస్థ ఎల్ఐసీ విధి విధానాలను లోతుగా అధ్యయనం చేకుండా దుష్ప్రచారాలకు ఆశ్రయమిస్తే- ప్రజల్లో గందరగోళం నెలకొని ప్రభుత్వరంగ ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తుంది.

# యువ ఉపాధ్యాయుడి కృషితో
# విద్యార్థికి బంగారు భవిష్యత్తు



## ప్రధానోపాధ్యాయులు అశోక్



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 4నవంబర్: సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలంలోని దరఖాస్తుపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి మంతూరి కార్తీక్ (%లా/శీ% మంతూరి అంజయ్య) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై గర్వకారణంగా నిలిచాడు.

మారుమూల గ్రామమైన దరఖాస్తుపల్లి నుండి మండల స్థాయిలో ప్రథమంగా ఎంపికైన కార్తీక్, ఆపై జిల్లా స్థాయిని దాటి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చాడు. దీంతో 2025%-%26 విద్యా సంవత్సరానికి హనుమకొండ క్రీడా పాఠశాలలో సీటు సంపాదించాడు. ఈ విజయానికి యువ ఉపాధ్యాయుడు బి. అశోక్ గారి నిరంతర శ్రద్ధ, కృషి ప్రధాన కారణమని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామ యువకులు ప్రశంసించారు. మండల విద్యాధికారి రంజిత్ కుమార్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయి. క్రీడా ప్రోత్సాహం కూడా సమానంగా అందుతోంది. అశోక్ , లత మేడం చేసిన కృషి ప్రశంసనీయమైనది" అని అభినందించారు.

గ్రామస్థులు విద్యార్థి కార్తీక్ విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు. చిన్నారిలో ఉన్న ప్రతిభను గుర్తించి, దాన్ని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల కృషి మరువరానిది అని పలువురు అభిప్రాయపడ్డారు.

# కేరూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సందేశం టైమ్స్:సంగారెడ్డి టౌన్ ప్రతినిధి 4నవంబర్ సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు, ఈ రోజు కేరూర్ గ్రామంలో తలెల్మ కిష్టయ్య గారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేరూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్రిష్ణ గౌడ్, సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు వినయ్ గౌడ్, వట్టి పల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వెంకట్ పాటిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాపయ్య, సాయి పటేల్, మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మర్వేల్లి గ్రామంలో ఘనంగా తమ్మలి హర్షవర్ధన్ జన్మదిన వేడుక







సందేశం టైమ్స్ %-% సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 4 నవంబర్: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వేల్లి గ్రామంలో తమ్మలి శివనిలా చంద్రశేఖర్ దంపతుల కుమారుడు తమ్మలి హర్షవర్ధన్ రెండవ వసంతం పూర్తి చేసుకుని మూడవ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు పాల్గొని హర్షవర్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారికి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ధర్మ రక్షక్ విష్ణు, నాగల్ల రాజు, తమ్మలి అరుణోదయ, చాకలి హరి, కలాలి సేతు, మాలపాడు అడ్డు తదితరులు పాల్గొన్నార

# మీసాల లచ్చయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివి
## అమీనాబాద్ మాజీ సర్పంచ్ డా.ముత్తినేని కోటేశ్వరావు



అనంతగిరి నవంబర్ 4 సందేశం టైమ్స్బీమీసాల లచ్చయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివనీ అమీనాబాద్ మాజీ సర్పంచ్ డా.ముత్తినేని కోటేశ్వరావు అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీసాల లచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ సర్పంచ్ డాక్టర్ ముత్తినేని కోటేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి మీసాల లచ్చయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీసాల లచ్చయ్య చివరి క్షణం వరకు పార్టీ జెండాను తన భుజాలపై వేసుకుని కాంగ్రెస్ కార్యకర్తగా పార్టీ కోసం కృషి చేశారాన్నారు. పేదరికంలో అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ మృతి చెందిన లచ్చయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతి పార్టీ కార్యకర్త మీసాల లచ్చయ్య ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి, ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ ల పంపిణీ




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 4నవంబర్: ఈరోజు సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండలం సింగీతం గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి దాత కమలాకర్ రాజు స్కూల్ పిల్లలకు స్పోర్ట్స్ డ్రెస్ లను అందించడం జరింగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య హాజరయ్యారు రాయికోడ్ మండల విద్యాధికారి మాణయ్య సార్ రాయికోడ్ మండల తాజా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ ,సింగీతం గ్రామ మాజీ సర్పంచ్ అంబన్న , రోటరీ క్లబ్ అధ్యక్షులు కిషన్ గారు, సెక్రెటరీ అంజయ్య ,%=వ్స వీవశీ% అంజయ్య ప్రతాప్ రెడ్డి ,శ్రీకాంత్ ,వేణుగోపాల్ ,రాజు కురుమ, రఫిక్ మియా,మూన, వీరేశం,మోహన్,అనిల్,జాఫర్, పాండు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# తిరుపతి బస్టాండూ అదానికే




**రూ.2 వేల కోట్ల ఆర్‌టిసి ఆస్తులు సమర్పయామి!**
**'పిపిపి'లో రూ.500 కోట్లతో 11 అంతస్తుల్లో ఆర్‌టిసి టెర్మినల్ నిర్మాణం**
**పైభాగంలో 'హెలిప్యాడ్'**

తిరుపతి నవంబర్ 4(సందేశం టైమ్స్) : రాష్ట్రంలోని పలు ఆస్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానికి కట్టబెట్టాయి. ఇప్పుడు ఆధ్యాత్మిక యాత్రా స్థలమైన తిరుపతిలోని బస్టాండ్‌ను కూడా బంగారు పళ్లెంలో ఆయనకే సమర్పించేందుకు రంగం సిద్ధమైంది. రూ.500 కోట్లతో 11 అంతస్తులను 'పిపిపి' (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో నిర్మించి మొత్తం రెండు వేల కోట్ల రూపాయల విలువైన ఆర్‌టిసి ఆస్తులను అప్పనంగా అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ప్రస్తుతం ఉన్న తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ కూల్చివేత గత నెల రోజులుగా ప్రారంభమైంది. పూర్తి స్థాయిలో కూలదోసి ఆ స్థానంలో ఆర్‌టిసి టెర్మినల్‌ను నిర్మించనున్నారు. తిరుపతి ఇంటిగ్రేటెడ్ మోడల్ బస్‌స్టేషన్‌లో 'కార్పొరేట్' శక్తులకు అనువుగా ఉండేలా 'హెలిప్యాడ్'ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి ఎయిర్‌పోర్టును అదానికి అప్పగించేందుకు కేంద్రం ప్రభుత్వం సిద్ధమవుతోంది. తిరుపతి ఇంటిగ్రేట్ మోడల్ బస్‌స్టేషన్‌ను అత్యాధునికంగా నిర్మించి టిడిపి కూటమి ప్రభుత్వం అదానికే కట్టబెట్టనుందనే చర్చ నడుస్తోంది. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారు. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి కానుందని చెప్తున్నారు. రాష్ట్రంలోనే తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోనే 'ఎర్నింగ్ ఫర్ కిలోమీటరు'లో తిరుపతి రీజియన్ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో 'విశాఖ' ఉంది. రోజుకు రూ.2 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తున్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను ప్రభుత్వం కారుచౌకగా 'కార్పొరేట్'కు కట్టబెట్టనుండడంపై ఆర్‌టిసి కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తిరుమల-తిరుపతికి రోజుకు లక్ష మందికిపైగా ప్రయాణికులు, యాత్రికులు వస్తున్నారు. ఇందులో 60 వేల మందికిపైగా ఆర్‌టిసి బస్సుల్లోనే చేరుకుంటున్నారు. ఈ సంఖ్య 2,034 నాటికి లక్ష, 2,052 నాటికి 1.50 లక్షలకు చేరుకొనే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో తిరుపతి ఇంటిగ్రేటెడ్ మోడల్ బస్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నామని పాలకులు చెబుతున్నారు. అయితే, 'పిపిపి' పద్ధతిలో నిర్మించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఓ ప్రైవేట్ కంట్రాక్టర్ కలిసి ఈ బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నారు. తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ 13.5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం 1,500 కోట్ల రూపాయలపైమాటే. పిపిపి పద్ధతిలో రూ.500 కోట్లతో ఆర్‌టిసి టెర్మినల్‌ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో 11 అంతస్తుల్లో నిర్మాణం చేపట్టనున్నారు. బస్టాండ్, హోటళ్లు, రెస్టారెంట్లు, బ్యాంకులు, కార్యాలయాలు, హెలిప్యాడ్, హైమాక్స్ తదితర అత్యంత అధునాతన వసతులతో నిర్మించనున్నారు. 150 బస్ ప్లాట్ ఫారాలతోపాటు, స్కూటర్లు, కార్లకు పార్కింగ్ సౌకర్యం, ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ సౌకర్యం ఉంటుంది. హర్యానాకు చెందిన 'రైట్స్' సంస్థ గత ఏడాది డిసెంబర్ నుంచి మూడు నెలల పాటు బస్టాండ్ ఆదాయ వనరులపై అధ్యయనం చేసింది. తిరుమల ఆధ్యాత్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతం కావడం, తిరుపతిలో ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్ ఉండడం, చెన్నరు-బెంగుళూరు మెట్రోపాలిటిన్ సిటీలు సమీపంలో ఉండడం వల్ల నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌కు మంచి ఆదరణ ఉంటుందని అంచనా.

# అన్నవరం...అప్రమత్తం!



అన్నవరం నవంబర్ 4(సందేశం టైమ్స్) : కార్తీకపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ నిర్వహణ, జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో అప్రమత్తతపై అన్న వరం దేవస్థానం అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. అలాగే డిప్యూ టీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కాకినాడ జి ల్లా ఎస్పీ బిందుమాధవ్ గిరిపద్రక్షిణ జరిగే సు మారు 11 కిలోమీటర్ల దూరాన్ని, భక్తులకు కల్పిం చే ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరె న్స్‌లో మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉ ందని ఉదయం 8గంటలకు పల్లకీసేవ, మధ్యా హ్నం 2గంటలకు సత్యరథంతో గిరియాత్ర జరు గుతుందన్నారు. ఎక్కడా తోపులాటలకు ఆస్కా రం లేకుండా రోప్‌పార్టీ ఉండాలని, 2 సమయాల్లో గిరిప్రదక్షిణ జరుగుతుందని విస్తృత ప్రచారం చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు ఎక్కడా వెయిటింగ్ లేకుండా నిరంతరాయంగా నడక కొనసాగేలా చేయాలని, ఒకేచోట భక్తజనం గుమికూడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఇప్పటికే దేవదాయశాఖ ముగ్గురు ప్రత్యేక అ? దికారులకు బాధ్యతలు అప్పగించగా గిరిపద్రక్షిణ ఫెస్టివల్ అధికారిగా రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాధరావును నియమించారు. గిరి పద్ర క్షిణ అనంతరం కార్తీకమాసం మిగిలిన పర్వ దినాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయలని సూచించారు. అనంతరం వీడియో కాన్ఫెరెన్సులో వెల్లడించిన అంశాలపై ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సిబ్బందితో సమావేశంలో వెల్లడించి కమిషనర్ ఆదేశాలకణుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా రూ.1500, 2000 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ అధికంగా ఉంటుందని పరిస్థితులుకు అనుగుణంగా వ్రతం టిక్కెట్ల విక్రయాలు చేపట్టాలని సూచిం చారు. కార్తీక పౌర్ణమి రోజున సు మారు 15వేల వ్రతాలు జరుగు తాయని అంచనా వేస్తూ ఏర్పా ట్లు, సిబ్బంది ఉండాలని తెలిపారు.

పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ సీఎం ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సాయంత్రం గిరిపద్రక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దారిని పరి శీలించారు. స్టాల్స్ ఏర్పాటు, మహిళలకు తాత్కాలిక మరు గుదొడ్ల తదితర వివరాలను దేవస్థానం అధికారులు వివరించగా ఆయన పలు సూచనలు చేశారు. పోలీస్ యంత్రాంగం అంతా చాలా అప్రమత్తంగా బాధ్యతతో వ్యవహరించాలన్నా రు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పర్యవేక్షణ జరగాలని డీ ఎస్పీ, సీఐలకు సూచించారు. కార్తీకమాసం పూర్తయ్యేవరకు భక్తులు అధికంగా వచ్చే పర్వదినాల్లో భద్రతాచర్యలు, గస్తీ ముమ్మరంగా ఉండాలని సూచించారు.

# ఏనుగుల జాడ కోసం.....



కల్లూరు,నవంబర్ 4(సందేశం టైమ్స్): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సరిహద్దులో ఉన్న తూర్పు విభాగం అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు జాడపై సోమవారం సాయంత్రం డ్రోన్ కెమెరాతో విస్తృతంగా గాలింపు చేపట్టినట్లు ఎఫ్ఎసవోలు మహమ్మద్ షఫి, భారతి, ఎఫ్‌బీవోలు మధు, జమున తెలిపారు. రాత్రి పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద ఏనుగుల మంద పంటలకు అపారనష్టం కలిగించడంతో అటవీశాఖ అధికారులు వాటి కట్టడికి డ్రోన్ తీసుకొచ్చారు. చిత్తూరు ఈస్ట్ రేంజ్, తిరుపతి జిల్లా పనపాకం రేంజ్ పరిధిలోని అధికారులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటిపడే సమయానికి అడవిలో ఏనుగుల జాడను డ్రోన్ కెమెరాలు గుర్తించలేక పోవడంతో అధికారులు వెనుదిరిగారు.

# 'పురం'లో వందే భారత్ ఆగుతుంది..



హిందూపురంనవంబర్ 4(సందేశం టైమ్స్) : వందే భారత్ రైలు పది రోజుల్లోపు హిందూపురంలో ఆగుతుందని ఎంపీ బీకే పార్థసారథితెలిపారు. హిందూపు రానికి వచ్చిన ఆయన విలేకరలుతో మాట్లాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తాను రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నతో మాట్లాడామని తెలిపారు. పురంలో వందే భారత్ రైలును ఆపేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు.రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. బళ్లారి నుంచి మడకశిర మీదుగా రైల్వే ట్రాక్ పనులు వేగంగా సాగుతాయని అన్నారు. చాకర్లపల్లి రైల్వే గేటువద్ద పై ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, దీనికి రూ.29 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఏడాదిలోపే పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని, రూ.92 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 7.85 కోట్లతో ఆరోగ్య కేంద్రాలు: విప్

రాయదుర్గం, నవంబర్ 4(సందేశం టైమ్స్) : నియోజకవర్గంలో రూ. 7.85 కోట్లతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను నిర్మిస్తామని, అలాగే ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేస్తామని విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టంచేశారు. బీఎన హళ్లి గ్రామంలో గ్రామసచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. వివిధ పద్దుల కింద ఈ పనులను ఏడాది లోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్, సోము, వీరేష్ పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించండి

శ్రీకాకుళం నవంబర్ 4(సందేశం టైమ్స్): క్రీడాకారు లంతా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాణించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడి యంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. టోర్నమెంట్‌లో మంచి ప్రతిభను కనబరిచి జాతీయ, అంతర్జా తీయస్థాయికి ఎదిగాలని కోరారు. కొన్ని ప్రత్యేక పరి స్థితుల్లో స్టేడియం పనులు నిలిచిపోయాయని, వీలైనంత వేగంగా పూర్తిచేసి క్రీడా కారులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీని వాసులు నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా క్రీడల నిర్వహ ణకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తామ న్నారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీవీఈవో విజయ్ కుమార్, జిల్లా ఒలింపిక్ సంఘం సలహ దారు పి.సుందరరావు, కార్యదర్శి ఎం. సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బీవీ రమణ, స్వాతి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.తవిటయ్య, ఎంవీ రమణ, కోశాధి కారి కె.మాధవరావు, గ్రిగ్స్ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సంగం పెన్నా వారధి వద్ద తప్పిన పెను ప్రమాదం..



నెల్లూరు:నవంబర్ 4(సందేశం టైమ్స్) : మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. మరోవైపు వర్షాలకు పెన్నానది ఉగ్రరూపం దాలుస్తోంది. ఈ క్రమంలో సంగం పెన్నా వారధి వద్ద పెను ప్రమాదం తప్పింది. పెన్నా నది నుంచి ఇసుక తరలించేందుకు నిల్వ ఉంచిన మూడు పడవలు.. భారీగా నీరు రావడంతో తాళ్ళు తెంచుకొని పెన్నానది గట్టున నిలిచాయి. అయితే ఆ పడవలు పెన్నా వారధి గేట్లకు తగలకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అవి గేట్లకు తగిలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని అధికారులు చెబుతున్నారు.ఏపీలో మొంథా తుఫాన్ తీవ్రరూపం దాల్చుతుంది. దీంతో పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరుగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. పలు కాలనీలకు భారీగా వరద నీరు చేరడంతో.. జలదిగ్బంధంలో ఇరుక్కున్నాయి. పలు చోట్లు వాగులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. వరద నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో.. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



ఆదిలాబాద్, నవంబర్ 4(సందేశం టైమ్స్) : ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 700 ఎకరాల భూమి స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో 6 ప్రాంతీయ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో భాగంగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ను ఎంపిక చేసింది. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టును సమర్పించింది. రిపోర్టు ప్రకారం ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ సాధ్యమని సూచించింది. ఈ మేరకు భూమి స్వాధీన ప్రక్రియ ప్రారంభించాలంటూ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. 700 ఎకరాల భూమిని జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ కోసం సేకరించనున్నారు. విమానాశ్రయం అభివృద్ధికి ప్రభుత్వం, సివిల్ ఏవియేషన్ శాఖలు సమన్వయం పాటించాలని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షణలో ప్రాజెక్టు అమలు కానుంది.

# రాకాసి రహదారి!



హైదరాబాద్, నవంబర్ 4(సందేశం టైమ్స్): జాతీయ రహదారిలో భాగంగా ఉన్నా.. అదో ఇరుకైన రోడ్డు. పైగా, రోడ్డుపై ఎన్నో గుంతలు.. గతుకులు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణ నుంచి కర్ణాటక ప్రాంతానికి వెళ్లే మూడు అత్యంత కీలకమైన రహదారుల్లో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి ఒకటి. ఎన్‌హెచ్–163గా పిలుస్తున్న ఈ రహదారిపై నిత్యం ప్రయాణం చేసేవారు దీనిని రాకాసి రహదారిగా పేర్కొంటున్నారు. ఏ మలుపు వద్ద ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో... ఎక్కడికక్కడ గుంతలు పడిన రోడ్డుపై ఎక్కడ పడిపోతామోనన్న భయం వెంటాడుతూనే ఉంటోందని వాపోతున్న పరిస్థితి. ఐటీ కారిడార్ ప్రాంతంలోని తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి మొయినాబాద్, చేవెళ్ల మీదుగా పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్, ఇతర ప్రాంతాలకు ఇది ప్రధాన రహదారి. ముఖ్యంగా తెలంగాణ పోలీసు అకాడమీ వద్ద ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ నుంచి మన్నెగూడ వరకు ఉన్న రోడ్డు ఏళ్ల తరబడిగా విస్తరణకు నోచుకోకపోవడంతో ఇరుకుగా ఉండి చాలా చోట్ల మూల మలుపులు ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ, ప్రాణాలు పోతున్నాయి. ఇప్పటికే అనేక ప్రమాదాల్లో 250 మంది దాకా ప్రాణాలు కోల్పోగా 600 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రభుత్వాలు ప్రయత్నించినా.. ఇందుకు రోడ్డు వెంట ఉన్న మర్రిచెట్లను తొలగించాల్సి ఉండటంతో పర్యావరణ ప్రేమికులు అడ్డు తగిలారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)లో వారు పిటిషన్లు వేయడంతో ఏళ్ల తరబడి జాప్యం జరిగింది.

# డిసెంబరు 2027 నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి



మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, నవంబర్ 4(సందేశం టైమ్స్): రాబోయే రెండేళ్లల్లో శ్రీశైలం ఎడమగట్టు కాల్వ టన్నెల్ (ఎస్ఎల్‌బీసీ) పనులను పూర్తి చేసి రైతులు, ప్రజల పట్ల తమ నిబద్ధతతను నిరూపించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారి పల్లిలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఔట్ లెట్ నుంచి సోమవారం చేపట్టిన హెలీబార్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ జియోఫిజికల్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పాలమూరు, నల్గొండ జిల్లాలకు సాగునీటి విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రధానంగా తెర మీదకు తీసుకొచ్చి తెలంగాణ ఉద్యమాన్ని నడిపి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ల కాలంలో పాలమూరు, నల్లగొండ జిల్లాలకు ఒరుగబెట్టిందేమి లేదన్నారు. అంతేకాకుండా కృష్ణానది జలాల విషయంలో నాటి ఆంధ్రా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌తో లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకుని రైతాంగాన్ని నిండా ముంచారన్నారు. కృష్ణా జలాల విషయంలో సింహాభాగం ఆంధ్రాకు దక్కేలా చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్ముడుపోయిందని విమర్శించారు. కృష్ణానది జలాల్లో దాదాపు 500 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం పాలమూరు, నల్గొండ జిల్లాలకు ఉన్నప్పటికీ అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ ప్రేక్షకపాత్ర పోషించాడని విమర్శించారు. దీంతో పాలమూరు– రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల, ఎన్ఎల్‌బీసీ ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయావని, ఈ కారణంగా కృష్ణానది జలాల వాటా విషయంలో ఆంధ్రాకు తమ వాదనలు సుప్రీంకోర్టు, ట్రిబ్యూనల్‌లో వినిపించే వెసులుబాటు కలిగిందన్నారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నారు. నల్గొండ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసుకోవడానికి ఇంతకంటే మంచి తరుణం దొరకదు. ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకునే శక్తుల పట్ల ఐక్యంగా ఉద్యమించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఎల్‌బీసీ నిర్మాణాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేసి నల్గొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో 30లక్షల మందికి రక్షిత తాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ఆయన చెప్పారు.

నాలుగు రోజుల్లో సర్వే నివేదిక..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనులను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో అధునాతనమైన హెలీబార్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ జియోఫిజికల్ సర్వేకు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపింది. ఎస్ఎల్‌బీసీ రిస్క్యూ ఆపరేషన్‌లో కీలక భూమిక నిర్వహించిన కల్నల్ పరిషత్ మోహారాను డిప్యూటేషన్‌పై తెలంగాణకు తీసుకొచ్చింది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కెనడాకు చెందిన హెలీబార్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ టెక్నాలజీ దోహదపడనుంది. హెలికాప్టర్ ద్వారా నిర్వహించే ఈ సర్వే భూమి అంతర్భాగంలో 30 నుంచి వెయ్యి మీటర్లలోపు ఉన్న పరిస్థితిని ప్రతీ 200మీటర్లకు సంబంధించిన నివేదికను సూక్ష్మస్థాయిలో అందిస్తోంది. దోమలపెంట నుంచి మన్నెవారి పల్లి వరకు పూర్తి కావాల్సిన మరో 9.8కిలో మీటర్ల టన్నెల్ తవ్వకానికి సంబంధించి ఎదురయ్యే భౌగోళిక పరిస్థితులన్నింటినీ ఈ సర్వే పరిష్కార మార్గాన్ని చూయించనుంది. ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్‌లో ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో 8మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో తిరిగి పనులు పునఃప్రారంభిస్తే ప్రాణ నష్టం జరగకుండా ఆచితూచి అడుగు వేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ విధానంలో మిగతా టన్నెల్ తవ్వకాలు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# పోకిరీలపై కొరడా




కరీంనగర్ నవంబర్ 4(సందేశం టైమ్స్): పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా షీ టీం పోలీసులు పోకిరీలపై కొరడా ఝళిపిస్తున్నారు. విద్యార్థినులు, యువతులు, బాలికలు, మహిళల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తూ నూతనోత్సాహంతో షీ టీంలు ముందుకుసాగుతున్నాయి. కమిషనరేట్ వ్యాప్తంగా 10కిపైగా షీ టీంలు పని చేస్తున్నాయి. ఇటీవల జిల్లాలోని ఒక పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ బాలికల వాష్‌రూంలో సీక్రెట్ కెమెరా ఏర్పాటు చేసి, బాలికపై వేధింపులకు, లైంగికదాడికి పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో షీటీం పోలీసుల నిఘాను మరింత పెంచారు. బాలికలు, మహిళలు, విద్యార్థినులు, పోకిరీల వేధింపులను ఎదుర్కొంటే ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మహిళలు విద్యార్థినిల పోకిరీల వేధింపులను భరించాల్సిన అవసరం లేదనే నిర్ణయంతో షీటీంకు చెందిన పోలీసులు మఫ్టీలో ముఖ్య కూడళ్ల వద్ద నిఘాపెట్టి పోకిరీలను ఆధారాలతో సహాపట్టుకునేందుకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నారు. వేధింపుల తీవ్రతనుబట్టి తల్లిదండ్రుల సమక్షంలో ఆధారాలను చూపిస్తూ కౌన్సెలింగ్‌లను నిర్వహించడంతోపాటు క్రిమినల్ కేసులను నమోదుచేస్తూ షీటీంలు పోకిరీలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. అక్టోబరు నెలలో పోకిరీల వేధింపులపై షీటీం పోలీసులకు వాట్సప్, క్యూఆర్ కోడ్ ద్వారా, పోలీస్‌కమిషనర్ ద్వారా, ఇతర పోలీసు ఠాణాలు, అధికారుల ద్వారా పలు ఫిర్యాదులు అందాయి. ఇందులో వేధింపుల తీవ్రత ఆధారంగా నిందితులపై ఎనిమిది క్రిమినల్ కేసులు నమోదు చేశారు. మరో 38 పోకిరీలను షీటీం పోలీసులు రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిపై పెట్టీ కేసులు నమోదు చేసి, 13 మందికి కుటుంబం సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మరి కొందరిని హెచ్చరించి వదిలేశారు.

ఫ గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

విద్యాసంస్థలకు షీ టీం పోలీసులు వెళుతూ అశ్లీలత, వేధింపుల తీవ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వేధింపులు ఎదుర్కొన్న వారు డయల్ 100, వాట్సప్ నంబర్ 8712670 759, క్యూఆర్‌కోడ్ ద్వారా ఫిర్యాదు చేయాలని స్టాల్స్ ద్వారా ప్రదర్శిస్తున్నారు. ప్రయాణ సమయంలో మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన టీ సేఫ్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్ ఉన్న విద్యార్థినులు, మహిళలతో డౌన్‌లోడ్ చేయిస్తున్నారు.

# నీటి మధ్యే 10 రోజులు సావాసం



డిండి, నవంబర్ 4(సందేశం టైమ్స్) : వారు ముగ్గురు గొర్రెల కాపరులు.. నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి వాసులు బద్దెల వెంకటయ్య, రగడంపల్లి పెద్దయ్య, సిగ వెంకటయ్య 10 రోజుల క్రితం 300 గొర్రెలు, మేకలను మేపుకు రావడానికి అడవికెళ్లారు. కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో డిండి (దుందుభి) వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంలో దాని మధ్యలో ఉన్న మట్టి దిబ్బపై చిక్కుకున్నారు. చుట్టూ వరద నీరు ప్రవహిస్తుండటంతో ఎటూ వెళ్లలేక అక్కడే ఉండిపోయిన ముగ్గురు జీవాల కాపర్లు వెంట తీసుకెళ్లిన సరుకులైపోవడంతో గ్రామస్తులు డిండి తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు. దీనిపై స్పందించిన దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ తదితరులు డిండి వాగు దగ్గరకు చేరుకున్నారు. డ్రోన్ సాయంతో గొర్రెల కాపర్లకు నిత్యావసర సరుకులు పంపారు.

# మక్కలు కొనాలని రోడ్డెక్కిన రైతులు

కొల్లాపూర్, నవంబరు 4 (సందేశం టైమ్స్) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకునేందుకు తిప్పలు తప్పడం లేదంటూ మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పండించిన మొక్క జొన్న కొనుగోలు చేయడం లేదని కొల్లాపూర్ పట్టణంలో రొడ్డెక్కి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న పండించిన రైతులకు క్వింటాలు మొక్కజొన్నకు రూ. 2,400, మద్దతు ధర ప్రకటించింది. అదే విధంగా ఎకరాకు 18.5 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం 18.5 క్విం టాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తే మిగతా మొక్కజొన్న ఏం చేసుకోవాలని అధికారులను నిలదీశారు. నిలిచిన రాకపోకలు రైతుల రాస్తారోకోతో గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు, వ్యవసాయ అధికారులు రాస్తారోకో వద్దకు చేరుకొని రైతులతో చర్చించారు. కలెక్టర్ ఆదేశానుసారం రెండు రోజుల్లో రైతులకు పూర్తి సమాచారం అందజేస్తామని పేర్కొనడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఇదిలా ఉండగా కొల్లాపూర్ మార్కెట్ యార్డుకు 40 రోజుల క్రితం వివిధ గ్రామాల నుంచి మొక్క జొన్న పంటను తీసుకువచ్చి ఆరబెట్టుకున్నామని, కొనుగోలు చేసే వారే లేరని, వారం క్రితం సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించినా నేటికీ ఒక్క గింజ కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కనీస వసతులు కల్పించలేని సింగిల్‌విండో సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

(Sandesham Times) TG TEL/25/A0348"Title: Sandesham Times"Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206"Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,"3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206" Phone: 9052045435."Printed at: Sunday Printing Press,"3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006